క్లుప్తంగా

పొంగులేటి ఆత్మీయ భరోసా అందజేత

కూసుమంచి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఇటీవల మృతిచెందగా.. వారి కుటుంబాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందించే ఆత్మీయ భరోసాను బుధవారం స్థానిక నాయకులు అందజేశారు. మృతిచెందిన ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి అందజేశారు.

శుభ్రతపై అవగాహన

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ పరిధిలో 100 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం శుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని 1, 3, 4, 7, 17, 21, 33, 43, 53వ డివిజన్లలో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసి రహదారులు, కాల్వ లను శుభ్రం చేసి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం రైల్వే స్టేషన్‌లో నాలుగు రోజుల క్రితం ఓ వృద్ధుడు మృతి చెందగా.. రైల్వే పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతదేహం కోసం ఎవ్వరూ రాకపోవడంతో అనాథ శవంగా భావించి రైల్వే పోలీసులు అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు, వైద్యశాల సిబ్బంది సమక్షంలో బుధవారం బల్లేపల్లి వైకుంఠధామంలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఆలయ భూముల వేలం పాట ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: నేలకొండపల్లి రాజగోపాలస్వామి ఆలయ భూముల వేలం పాటలో మూడేళ్ల పాటు కొనసాగేలా బుధవారం వేలంపాట నిర్వహించారు. కానీ భూముల ఆక్రమణపై రైతులు నిలదీశారు. ఏడాదికి రూ. 2.41 లక్షలకు అధికారులు పాటను ఖరారు చేశారు. వేలంలో ఉప్పలయ్య అనే రైతు 13 ఎకరాల 25 కుంటల భూమిని దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మన్నె రవి, ఈఓ కె.శ్రీకాంత్, అర్చకులు రాము, డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో క్యాజువాలిటీ వార్డు ప్రారంభం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆధునీకరించిన క్యాజువాలిటీ వార్డును బుధవారం ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ ప్రారంభించారు. ఈ వార్డులో యాక్సిడెంట్, పాయిజన్ కేసులతో పాటు గుండెపోటు, పాముకాటు వంటి అత్యవసర సేవలను అందిస్తారన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ రాంబాబు, ఆర్థోపెడిక్ హెచ్ఓడీ ఎల్. కిరణ్‌కుమార్, నందగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నేలకొండపల్లి: హైదరాబాద్‌లోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆయన క్యాంప్ కార్యాలయంలో మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మండలం పరిధి ముఠాపురం గ్రామంలోని సమస్యలను విన్నవించాక మంత్రిని సన్మానించారు. రావెళ్ల కృష్ణారావు, బెల్లం వాసు తదితరులు ఉన్నారు.

'దండి'కి శుభాకాంక్షలు



సురేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్/ఖమ్మంమామిళ్లగూడెం: సీపీఐ జిల్లా కార్యదర్శిగా నియమితులైన మండలంలోని ఏదులాపురంకు చెందిన దండి సురేష్‌కు బుధవారం పలు సంఘాల నాయకులు, జర్నలిస్టులు బుధవారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మున్నూరు కాపు సంక్షేమ సంఘం నాయకులు గుండాల కృష్ణ, యాదవ సంఘం అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూలతో పాటు కొత్తాసీతారాములు, మెంతుల శ్రీశైలం, గీతా వెంకన్న, నాగిరెడ్డి, లక్ష్మీనారాయణ, బ్రహ్మాచారి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉద్యోగ సాధన

ఖమ్మంరూరల్: క్రమశిక్షణ, నైపుణ్యం ఉంటే ఉద్యోగ సాధన సులువని ఉమ్మడి జిల్లా మహిళా ప్రాంగణ అధికారి వేల్పుల విజేత అన్నారు. మండలంలోని కొత్తూరులో గల డేర్ ఇంజినీరింగ్ కళాశాలలో సమర్ధనం ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహించిన జాబ్‌మేళాలో ఆమె మాట్లాడారు. మొత్తం 30 కంపెనీలు పాల్గొనగా.. 250 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధినేత, ప్రిన్సిపాల్ దరిపల్లి కిరణ్, సంస్థ అధికారి సెంధిల్, తెలంగాణ, రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, ఉమ, శంకర్, కంపెనీల హెచ్ఆర్‌లు పాల్గొన్నారు.

55వ డివిజన్‌లో ఓ ఖాళీ స్థలంలో పోసిన నిర్మాణ, ఇతర వ్యర్థాలు



56వ డివిజన్‌లో ఇళ్ల మధ్య పెరుగుతున్న పిచ్చి మొక్కలు



సీజనల్‌కు సిగ్నల్స్..

ఖాళీ స్థలాలు.. వ్యాధులకు నిలయాలు

- అడవిని తలపించేలా పిచ్చి మొక్కలు
- వ్యర్థాలతో నింపుతున్న స్థానికులు
- దోమలు, దుర్వాసనతో వ్యాధుల వ్యాప్తి
- కేఎంసీపై పెరుగుతున్న భారం
- 3 వేలకు పైగా ఖాళీ స్థలాల గుర్తింపు

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాకాలం ప్రారంభం కావడంతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఖాళీ స్థలాలు వ్యాధులకు నిలయాలుగా మారాయి. వర్షపు నీరు నిలవడం, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పారిశుద్ధ్య సమస్యలకు, దోమలు, ఇతర కీటకాల వ్యాప్తికి ప్రధాన కారణమవుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో అడవిని తలపించేలా పిచ్చి మొక్కలు పెరుగుండగా.. కేఎంసీకి తలనొప్పిగా మారాయి. డివిజన్లలో క్షేత్రస్థాయి పారిశుద్ధ్య పనులతో పాటు ఖాళీ స్థలాలను శుభ్రం చేయాల్సి వస్తోంది.

అనారోగ్యాలకు నిలయాలుగా..

ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో దోమలకు ఆవాసాలుగా మారి మలేరియా, డెంగీ వంటి వ్యాధుల వ్యాప్తికి కారణమవుతోంది. అంతేకాక పిచ్చిమొక్కలు పెరిగి పాములు, ఇతర విషపురుగులు, ఎలుకలకు ఆశ్రయాన్ని కల్పిస్తుండడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. నిలిచిపోయిన నీరు, చెత్తాచెదారం వల్ల దుర్వాసన వెదజల్లుతూ మొత్తం పరిసరాలు అనారోగ్యకరంగా మారుతున్నాయి.

శివారు ప్రాంతాల్లో అధికం..

నగరంలోని 60 డివిజన్ల పరిధిలో 3 వేలకు పైగా ఖాళీ స్థలాలు ఉన్నట్లు కేఎంసీ అధికారులు గుర్తించారు. విలీన గ్రామాలతో పాటు శివారు ప్రాంతాల్లో ఈ స్థలాల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఈనేపథ్యాన డివిజన్ల వారీగా ఖాళీ స్థలాలను గుర్తించి ప్రణాళికబద్ధంగా వాటిలో నిలచిన నీటిని, పిచ్చిమొక్కలను తొలగించే కార్యక్రమాలను ప్రారంభించారు. డివిజన్‌కు రెండు నుంచి మూడు జేసీబీలతో ఆయా ఖాళీ స్థలాలను శుభ్రం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

శుభ్రం చేయిస్తున్నాం..

నగరంలో ఖాళీ స్థలాలను శుభ్రం చేయించేందుకు చర్యలు చేపట్టాం. ప్రతీ డివిజన్‌లో ఖాళీ స్థలాలను గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులు అందజేస్తాం. వారు స్పందించకుంటే మున్సిపాలిటీ ద్వారా శుభ్రం చేయించి జరిమానా విధిస్తాం. 3 వేల స్థలాలకు సంబంధించి నోటీసులను సిద్ధం చేస్తున్నాం.

– జె.అనిల్‌కుమార్, ఏఎంసీ, కేఎంసీ

భారంగా ప్రభుత్వ స్థలాలు..



విజయ డెయిరీ స్థలాలను శుభ్రం చేస్తున్న కార్మికులు

డివిజన్లలో ప్రైవేట్ స్థలాలను శుభ్రం చేయించడం కోసం అధికారులు ఆయా స్థల యజమానులకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేయిస్తున్నారు. లేనిపక్షంలో జరిమానాలు విధిస్తున్నారు. ఇంత వరకు భాగానే ఉన్నా.. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి, మురుగు ఏర్పడినా ఆయా కార్యాలయాల అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో శ్రమదానం, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాల పేరుతో శుభ్రం చేసుకునే పరిస్థితి నేడు కనిపించడం లేదు. దీంతో చేసేదేమి లేక కేఎంసీ అధికారులు పారిశుద్ధ్య పనుల కోసం నియమించుకున్న కార్మికులతో ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేయిస్తున్నారు. దీంతో కార్పొరేషన్‌పై అదనపు భారం పెరుగుతుంది.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

- కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం
- క్షేత్రస్థాయి ఉద్యోగులకు వరాలు



సమావేశంలో ప్రశ్నిస్తున్న కార్పొరేటర్ బీజీ క్లెమెంట్



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్య మాటల యుద్ధంతో కౌన్సిల్ సమావేశం వేడెక్కింది. బుధవారం ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. తొలుత కౌన్సిల్ ప్రతిపాదనలను అన్ని పక్షాల కార్పొరేటర్లు ఆమోదించినప్పటికీ ఆతర్వాత మొదలైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ప్లాస్టిక్ నియంత్రణపై చేపట్టిన చర్చ పక్కదారి పట్టింది. ఈ అంశాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్య తీవ్ర చర్చ సాగగా.. మేయర్‌తో పాటు కమిషనర్ అభిషేక్ అగస్త్య జోక్యం చేసుకొని వారిని సముదాయించారు. కాగా, ఏడాది లోపుగా పాలకవర్గం ముగుస్తుండడంతో క్షేత్రస్థాయిలోని ఉద్యోగులకు వరాల జల్లుకు ఆమోదం తెలిపారు.

ప్రొటోకాల్ పాటించలేదని..

కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టిన ప్రతిపాదనలను తొలుత ఇరు పక్షాలు, వామపక్ష పార్టీల కార్పొరేటర్లు ఆమోదించారు. అయితే ఏమైనా అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు అధికారులు తమకు సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్ మరిచారని కార్పొరేటర్లు మండిపడ్డారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ప్లాస్టిక్ నియంత్రణ చర్యలు, నగరానికి వచ్చిన అవార్డులపై ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో కార్పొరేటర్లను చైర్మన్‌గా నియమించి బహిరంగ సభలు పెట్టకుండానే ఇళ్లు మంజూరు చేశారన్నారు. దీంతో స్పందించిన కాంగ్రెస్ కార్పొరేటర్లు బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్రూం ఇళ్లు ఎలా మంజూరు చేశారని ప్రతిదాడికి దిగారు. అంతేకాక మధ్యమధ్యలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లను ప్రశ్నించడంతో మాటమాట పెరిగింది. గత ప్రభుత్వంలో ప్లాస్టిక్ నియంత్రణలో ఖమ్మం నగరానికి 6వ స్థానం రాగా ఇప్పుడు 60వ స్థానానికి చేరిందని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రశ్నించారు. దీనిపై మేయర్ మాట్లాడుతూ.. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్లాస్టిక్‌ను నియంత్రిస్తామని చెప్పారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ కమర్తపు మురళి ఖమ్మంలో ప్లాస్టిక్ కవర్లు విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటే ప్రయోజనం లేదని, కేంద్ర ప్రభుత్వం నుంచే చట్టం తేవాలన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం తారాస్థాయికి చేరింది. దీనిపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య జోక్యం చేసుకుని అవార్డులు రాకపోవడానికి గల కారణాలను వివరించారు. సీపీఐ కార్పొరేటర్ బీజీ క్లెమెంట్ మాట్లాడుతూ.. వాటర్ సప్లై వర్కర్స్ 16 మందిని ఔట్ సోర్సింగ్ సిబ్బందిగా గుర్తిస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలని డిమాండ్ చేయగా.. కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

లాభసాటి పంటల సాగుపై దృష్టి పెట్టండి



రేషన్‌కార్డు పత్రాలు అందుకున్న వారితో మంత్రి తుమ్మల, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, రాయల తదితరులు

రఘునాథపాలెం: రైతులు సంప్రదాయ పంటల స్థానంలో లాభసాటి పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని పరికల బోడుతండాలో రూ.3కోట్ల వ్యయంతో నిర్మించే రహదారి నిర్మాణానికి బుధవారం ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్, వక్క వంటి లాభసాటి పంటలు సాగు చేస్తే ఎకరాకు రూ.50వేల సబ్సిడీ వస్తుందని, అంతర పంటలుగా మిర్చి, పత్తి సాగు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే, డ్రిప్ పరికరాలు కూడా రాయితీపై అందుతాయని చెప్పారు. ఎత్తిపోతల పథకం ద్వారా వేసవిలోనూ మండలంలోని ప్రతీ చెరువును నింపే బాధ్యత తనదని మంత్రి తెలిపారు. అనంతరం గ్రామంలో పలువురికి నూతన రేషన్‌కార్డుల మంజూరు పత్రాలను అందజేశారు. ఆతర్వాత అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పామాయిల్ సాగును రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు నిరంతర కృషి జరుగుతోందన్నారు.

పేద ముస్లింల అభివృద్ధి మా బాధ్యత

ఖమ్మంఅర్బన్: పేద ముస్లింల అభివృద్ధికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో నలు దిక్కులా ఖబరస్తాన్‌లు ఏర్పాటుచేయనుండగా, షెడ్లు, ప్రహరీ నిర్మించి బోర్లు వేయిస్తామని తెలిపారు. అలాగే, ఫైర్‌స్టేషన్ వద్ద నిర్మించిన షాదీఖానా మరమ్మతులు చేయించి సమావేశాలకు కేటాయిస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల్లో పది శాతం ముస్లింలు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా మాట్లాడుతూ ఎల్‌బీ.నగర్, ఖానాపురం, కొత్తగూడెంల్లో ఖబరస్తాన్ల కోసం ఆరు ఎకరాల భూకేటాయింపులో మంత్రి తుమ్మల కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈకార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, మేయర్ పి.నీరజ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీసీఎస్ఓ చందన్‌కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి పురంధర్, డీఎల్‌పీఓ రాంబాబు, తహసీల్దార్లు శ్వేత, సైదులు, ఆత్మ, పీఏసీఎస్ చైర్మన్లు దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, రావూరి సైదబాబు, తాతా రఘురాం, పీఆర్ ఈఈ మహేష్‌తో పాటు మానుకొండ రాధాకిషోర్, సాధు రమేష్‌రెడ్డి, వాంకుడోత్ దీపక్, దేవ్‌సింగ్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

లాభదాయకంగా ఆయిల్‌పామ్ సాగు

రఘునాథపాలెం: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభం ఉంటుందని ఉద్యాన శాఖ అధికారి నాగేష్ తెలిపారు. మండలంలోని కోయచలకలో ఉన్నా శ్రీనివాసరావు ఇరవై ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను గోద్రెజ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ చందుతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోట ఒకసారి నాటితే 30ఏళ్ల పాటు ఆదాయం వస్తుందని, కోతులు, ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలు భయం ఉండదని చెప్పారు. రైతులకు ప్రభుత్వం పలురకాలుగా రాయితీలు ఇస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్‌బీ జీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకీరుల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాచలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్-3, బీసీఏ- 2, బయోటెక్నాలజీ-1, బాటనీ-1, బిజినెస్ అనలిటిక్స్ -1, కామర్స్-1, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్-8, డేటా సైన్స్-1, ఇంగ్లిష్ -1, హిస్టరీ-3, మేథమెటిక్స్-2, పొలిటికల్ సైన్స్-2, స్టాటిస్టిక్స్-1, తెలుగు-1 ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5గంటల కల్లా తమ దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో అందజేయాలని, ఇంటర్వ్యూ 29న ఉదయం 10 గంటల నుంచి కళాశాలలో నిర్వహించబడుతుందన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ మిత్ర ఫౌండేషన్, బోడేపూడి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యాన 40మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఖమ్మంలోని బోడేపూడి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఈ కార్యక్రమం జరగగా మిత్ర ఫౌండేషన్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. మహిళల స్వయం ఉపాధి కోసం కుట్టుమిషన్లు ఉపయోగపడతాయనే భావనతో పంపిణీ చేశామని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుతో పాటు కానూరి హిమబిందు, రంగా శ్రీనివాస్, పాలవరపు శ్రీనివాస్, మహంకాళి నగేష్, రవి, గురుకృష్ణ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..



చెక్కు అందిస్తున్న కార్పొరేటర్ సైదులు

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అందించే సహకారాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని 8వ డివిజన్ కార్పొరేటర్ లకావత్ సైదులు నాయక్ సూచించారు. ఖమ్మం వైఎస్సార్‌నగర్‌కు చెందిన ముగ్గురికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసుతో మంజూరైన రూ.1.48 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఆయన అందజేసి మాట్లాడారు. నాయకుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వర్క్‌బుక్స్..

కామేపల్లి: మండలంలోని టేకులతండా జీపీఎస్ పాఠశాలలో ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్టు అధికారి రాహుల్ గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా చేయించిన ఉద్దీపకం-2 వర్క్‌బుక్‌లను బుధవారం ఏటీడీఓ జహీరుద్దీన్ విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్ఎం తేజావత్ వీరన్న, సపావట్ కిషన్, మాలోత్ రాజా, కార్యదర్శి నాగేంద్రనాయక్ పాల్గొన్నారు.

బ్యాగులు..

కామేపల్లి: మండలంలోని గరిడేపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఖమ్మం చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన అందించిన బ్యాగులను బుధవారం హెచ్ఎం పవన్ సమక్షంలో అందజేశారు. ఉపాధ్యాయులు దేవాసింగ్, శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ధరావత్ రాంజీ, రాంజీ, రాజేశ్, గోపీ, వీరన్న, మహబూబ్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తహసీల్దార్లకు..



తిరుమలాయపాలెం: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం/కామేపల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సభ్యులు బుధవారం తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. తిరుమలాయపాలెంలో తహసీల్దార్ లూథర్‌విల్సన్‌కు వినతిపత్రం అందించగా, కామేపల్లిలో తహసీల్దార్ సుధాకర్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. బదిలీలు, ప్రమోషన్లు వెంటనే నిర్వహించాలని, పెండింగ్ బిల్స్ క్లియర్ చేయాలని, పీఆర్సీ, డీఏలు ఇవ్వాలని విన్నవించారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి పెన్షన్ బెనిఫిట్స్ చెల్లించాలని, కేంద్రం తీసుకొస్తున్న కొత్త పెన్షన్ పథకాన్ని ఉపసంహరించుకోవాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని వినతిలో పేర్కొన్నారు. మొదటి దశలో తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించామని, రెండో దశగా ఆగస్టు 1న జిల్లా కేంద్రాల్లో ధర్నా, మూడవ దశలో ఆగస్టు 23న హైదరాబాద్‌లో ధర్నా కార్యక్రమాలు చేయనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌పీసీ భాగస్వామ్య సంఘాల నాయకులు మాలోత్ రామారావు, ఏ.వీ.నాగేశ్వరరావు, బి.కేష్యా, డి.వెంకట్రాములు, లక్ష్మి, భద్రయ్య, ధనమూర్తి, వీరబాబు, హనుమంతు, శ్రీనివాస్, రఘుబాబు, సుభాషిణి, వాణిశ్రీ, విజయ, గోపమ్మ, కృష్ణకళ, వెంకటేశ్వర్లు, బస్సీలాల్, నరసింహారావు, నాగు, రవికుమార్, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు..

ఖమ్మం మామిళ్లగూడెం: సీతారామ ప్రాజెక్టు ద్వారా కారేపల్లి, కామేపల్లి, ఏన్కూరు మండలాలకు నీళ్లు ఇవ్వాలని కోరుతూ జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యాన బుధవారం అదనపు కలెక్టర్ పి.శ్రీజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పగడవరపు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. వర్షాధారంపైనే ఆధారపడి ఉన్న మండలాలకు నీరు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అలాగే సీడ్ మొక్కజొన్న రైతులకు దళారులతో సంబంధం లేకుండా కంపెనీలే నేరుగా ఖాతాలో జమచేసేలా కార్యాచరణ రూపొందించాలని, కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామంలో భక్త రామదాసు కాల్వ నష్టపరిహారం ఇవ్వాలని, తనికెళ్లలో చేలకు వెళ్లే డొంక రోడ్డును వేయాలని కోరారు. భారతీయ కిసాన్ సంఘ్ ఖమ్మం జోన్ కార్యదర్శి మందనపు రామారావు, జిల్లా కార్యదర్శి తాళ్లూరు శ్రీనివాసరావు, జిల్లా సహాయ కార్యదర్శి తూము అప్పారావు, సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల సమస్యకు పరిష్కారం



ఏఈకి చెక్కు అందిస్తున్న ఎండీపీఓ, తదితరులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం గ్రామపంచాయతీ పరిధి ఖమ్మం – ఇల్లెందు రోడ్డులో డివైడర్ల మధ్యలోని వీధిలైట్ల విద్యుత్ బకాయిల సమస్యకు పరిష్కారం లభించింది. ఈ రోడ్డు గ్రామపంచాయతీ పరిధిలో ఉండగా, గతేడాది అక్టోబర్ నుంచి నేటి వరకు విద్యుత్ బిల్లు రూ.17,95,618 బకాయి పడింది. కానీ బిల్లు చెల్లించేందుకు జీపీ ఖాతాలో నిధులు లేకపోవడంతో రఘునాథపాలెం పీఏసీఎస్ చైర్మన్ తాతా రఘురాం, తదితరులు సమస్యను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచన మేరకు 'సుడా'నిధులు మంజూరు చేయించగా, విద్యుత్ బిల్లు చెక్కును బుధవారం ఏఈ శంకర్‌కు ఎంపీడీఓ అశోక్‌కుమార్, గ్రామకార్యదర్శి అనురాధ అందజేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు బోయిన వెంకటనర్సయ్య, రెంటాల ప్రసాద్, మందా బుచ్చిబాబు, పందుల ఉపేందర్, చిక్కుళ్ల రామయ్య, నంద్యానాయక్, చందర్, అల్లిక రామకృష్ణ, జగ్యానాయక్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు ర్యాలీగా వెళ్లి పాఠశాలలకు వెళ్లి బంద్ చేయించారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, బెస్ట్ అవైలబుల్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంరూరల్: జలగంనగర్ పాఠశాలలో జరిగిన బంద్‌లో పాల్గొన్న విద్యార్థులు



తిరుమలాయపాలెంలో విద్యా సంస్థలు బంద్ చేయిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



రఘునాథపాలెం: చిమ్మపుడిలో నినాదాలు చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు



కామేపల్లి: బంద్‌లో పాల్గొన్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

అటెన్షన్ ప్లీజ్





మండలంలోని కామంచికల్ గ్రామపంచాయతీ శివారు ముత్యాలగూడేనికి పక్కనే ఉన్న రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణంలో వర్షం నీరు చేరడంతో రైతులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ బ్రిడ్జి కింద నుండే రైతులు తమ పొలాలకు వెళ్లాల్సి వస్తుండగా.. వర్షపు నీరు ఎక్కువగా చేరినప్పుడల్లా తిప్పలు తప్పడం లేదు. మోకాళ్ల లోతు వరకు నీరు చేరుతుండడంతో భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. నీటిని బయటకు పంపేలా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

– ఖమ్మంరూరల్